

పశు సంవర్థకశాఖ ఎడి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

పశుసంవర్థకశాఖ టెక్కలి డివిజన్ ఉప సంచాలకునిగా డాక్టర్ పి.చంద్రశేఖరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పలాస డివిజన్ ఉప సంచాలకునిగా పనిచేస్తున్న ఆయన బదిలీపై టెక్కలి వచ్చారు. ఇక్కడ ఉప సంచాలకునిగా పనిచేసిన డాక్టర్ వి.జయరాజు పాడేరు బదిలీపై వెళ్లిన విషయం విదితమే. పశు సంవర్థకశాఖ అధికారి ఎస్.శిరీష, సీనియర్ అసిస్టెంట్ ఎస్.గోవింద్, జూనియర్ అసిస్టెంట్ కె.రూప, కంప్యూటర్ ఆపరేటర్ కె.గోవిందరావు, ఎన్.రామచంద్రరావు తదితరులు చంద్రశేఖర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.



యోగా టెన్షన్

విశాఖ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి రోజులు సమీపిస్తున్నాయి. దీంతో అధికారుల్లో టెన్షన్ మొదలైంది. యోగా డే నిర్వహణలో భాగంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గత నెల 21వ తేదీ నుంచి జిల్లా యంత్రాంగం అనేక కార్యక్రమాలు నిర్వహించింది. పర్యాటక, ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాంతాల్లో సామూహిక యోగాసానాలు ఏర్పాటు చేయించింది. ఇవన్నీ ఒక ఎత్తు అయితే ఈనెల 21న విశాఖలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం మరో ఎత్తు. యోగా డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్ర మోడీ వస్తుండడంతో, టిడిపి కూటమి ప్రభుత్వం చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. జిల్లా నుంచి 20 వేల మందిని విశాఖకు తరలించాలని లక్ష్యంగా నిర్దేశించడంతో అధికారులు ఆపసోపాలు పడుతున్నారు.

- **సమీపిస్తున్న యోగా డే**
- **అధికారుల్లో మొదలైన వణుకు**
- **జిల్లా నుంచి 20 వేల మంది తరలింపు**
- **500 ప్రభుత్వ, ప్రైవేట్ బస్సుల వినియోగం**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

విశాఖలో ఐదు లక్షల మందితో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా డేకు జిల్లా నుంచి 20 వేల మందిని భాగస్వాములను చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అందుకనుగుణంగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. యోగా డేలో పాల్గొనే వారు ప్రయాసలు పడకుండా విశాఖకు దగ్గరగా ఉండే మండలాలతో పాటు వేదిక ప్రాంగణానికి వేగంగా చేరుకునే ప్రాంతాలను అధికారులు ఎంపిక చేశారు. ఎచ్చెర్ల, శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట, నియోజకవర్గాల పరిధిలోని 14 మండలాల నుంచి 20,580 మందిని తరలించాలని అధికారులు నిర్ణయించారు. ప్రజలను తరలించడానికి 497 బస్సులు అవసరమని గుర్తించారు. ఇందులో ఆర్‌టిసి 150 బస్సులను సమకూర్చనుంది. ప్రైవేట్, విద్యాసంస్థల బస్సులు కలిపి మరో 400 బస్సులను జిల్లా రోడ్డు రవాణశాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారు. ట్రాఫిక్, ప్రయాణాల్లో ఇబ్బందులు తలెత్తితే పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్‌ను సైతం ఏర్పాటు చేస్తున్నారు.

అధికారులకు ప్రధాన బాధ్యతలు

విశాఖ యోగా డే ఏర్పాట్లకు సంబంధించి ఒక్కో ప్రభుత్వశాఖ అధికారికి ఒక్కో బాధ్యతను అప్పగించారు. బస్సుల్లో తరలించే బాధ్యతను జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, డ్వామా పీడీ సుధాకరరావుకు అప్పగించారు. ఆయా శాఖల సిబ్బంది సాయంతో 14 మండలాల ప్రజలను వారు విశాఖకు తరలించాల్సి ఉంటుంది. బస్సులను సమకూర్చే బాధ్యతను డిప్యూటీ కమిషనర్, జిల్లా ప్రజా రవాణా అధికారికి అప్పగించారు. విశాఖలో వాహనాల పార్కింగ్ ఇన్‌ఛార్జీలుగా వ్యవసాయశాఖ జెడి, గృహ నిర్మాణశాఖ పీడీ, జిల్లా ఉద్యానశాఖ అధికారిని నియమించారు. శ్రీకాకుళం జిల్లా నుంచి వెళ్లే బస్సులకు విశాఖలో తొమ్మిది చోట్ల పార్కింగ్ సదుపాయం కల్పించారు. 27 కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేశారు. ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి శాంతిభద్రతలు, ట్రాఫిక్ మోనటరింగ్ బాధ్యతలను పర్యవేక్షిస్తున్నారు.

తరలింపే అసలు సవాల్

విశాఖలో నిర్వహించనున్న యోగా డేకు సంబంధించి జిల్లా నుంచి వెళ్లే వారికి భీమిలి బీచ్ నుంచి కాపులుప్పాడ ప్రాంతం వరకు కేటాయించారు. వేదికకు ప్రజలను తరలించడమే అధికారులకు అసలు సవాల్‌గా మారింది. సాధారణంగా ప్రధాని, ముఖ్యమంత్రి పాల్గొనే సభలు ఉదయం పది గంటల తర్వాత మొదలవుతాయి. కానీ యోగా డే మాత్రం ఉదయం 6.30 గంటలకే ప్రారంభం కానుంది. సెక్యూరిటీ, ఇతర సమస్యల వల్ల ప్రజలు 5.30 గంటలకే వేదికకు చేరుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని మారుమూల ప్రాంతాలైన జలుమూరు, పోలాకి వంటి ప్రాంతాల నుంచి ఉదయం మూడు గంటలకే బయలుదేరేలా అధికారులు ప్లాన్ చేస్తున్నారు. కాలకృత్యాలు, స్నానాలకు సమయం పట్టే అవకాశం ఉండడంతో రెండు గంటలకే వారిని రెడీ చేయాలని నిర్ణయించారు. ఆ సమయంలో గ్రామాల్లోకి వెళ్లి బస్సుల్లో జనాలను తరలించడం కష్టంగా మారే అవకాశం ఉండడంతో, మండలంలో ఏదో ఒక కళ్యాణ మండపంలో వీరిని ముందు రోజే తరలించాలని ప్లాన్ చేస్తున్నారు. దీంతో జన సమీకరణ, బస్సులు, ఇతర బాధ్యతలు చూస్తున్న అధికారులకు ముందే రోజే జాగారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఆరోజు ప్రయాణాలు మానుకోవాల్సిందే

యోగా డేకు ఆర్‌టిసి మొత్తం 220 బస్సులను వినియోగిస్తోంది. ఇందులో యోగాకు వెళ్లే వారి కోసం 150 బస్సులు ఉపయోగిస్తుండగా, మరో 70 బస్సులను అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు పంపారు. వీటితో పాటు ఇతర ప్రైవేట్, ఒడిశా బస్సులను సైతం ప్రజలను తరలించడానికే ఉపయోగిస్తున్నారు. దీంతో ఈనెల 21న ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తప్పేలా లేవు. దీంతోపాటు 20వ తేదీ రాత్రికే కొన్ని బస్సులను ఆయా సెంటర్లకు తరలించనుండడంతో సాయంత్రం పూట తక్కువ సర్వీసులు నడిచే అవకాశముంది.

ఉద్యోగులకు 21 వరకు సెలవుల్లేవు

విశాఖపట్నంలో నిర్వహిస్తున్న యోగా డేతో పాటు జిల్లాలో అదే రోజు 6,362 ప్రాంతాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమానికి జనాలను తరలించడంతో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది భాగస్వామ్యం కావాలని ఇప్పటికే అన్ని ప్రభుత్వశాఖలకు కలెక్టరేట్ నుంచి ఉత్తర్వులు వెళ్లాయి. ఎన్నికల మాదిరిగా అందరూ భాగస్వామ్యం కావాలని అందులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తీవ్ర అనారోగ్యం అయితే తప్ప ఈనెల 21వ తేదీ వరకు ఎవరికీ సెలవులు మంజూరు చేయొద్దంటూ ప్రభుత్వశాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



ఉపాధ్యాయులు కావలెను

- **కవిటి మండలంలో భారీగా ఎస్‌జిటి ఖాళీలు**
- **ఏకోపాధ్యాయులకు తప్పని తిప్పలు**
- **డిఎస్‌సి పైనే ఆశలు**

ప్రజాశక్తి - కవిటి

కవిటి మండలంలోని చాలా ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు తమ ఉపాధ్యాయుడు ఎవరనేది ప్రస్తుతానికి అంతుచిక్కని ప్రశ్నగా మారింది. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో చాలామంది ఉపాధ్యాయులు బదిలీలపై వెళ్లిపోగా, మారుమూల ప్రాంతంలోని కవిటి మండలానికి ఎవరూ రాకపోవడంతో మండలంలో సుమారు 59 వరకు ఎస్‌సిటి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాఠశాలల విలీన ప్రక్రియలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కలిసిన మూడు, నాలుగు, ఐదు తరగతులకు ఉపాధ్యాయులు లేకపోవడంతో ఆయా పాఠశాలల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. మండలంలో సుమారు 20 వరకూ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ ఖాళీలు భర్తీ చేసినట్లు చూపిస్తున్నా చాలా పాఠశాలల్లో ఇంకా కొత్తవారు చేరలేదు.

ఏకోపాధ్యాయులకు తప్పని తిప్పలు

మరోవైపు మండలంలో 20 వరకు ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. ఏళ్ల తరబడి ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఇటీవల జరిగిన బదిలీల్లో వేరే ప్రాంతాలకు వెళ్లి అక్కడ విధుల్లో చేరి మళ్లీ కవిటి మండలంలో విధులు నిర్వహిస్తున్నారు. డిఎస్‌సిలో కొత్త పోస్టులు మంజూరయ్యే వరకు వీరు ఇక్కడ కొనసాగాల్సిందే. దీంతో వీరికి బదిలీ అయినా కానట్టే ఉంది పరిస్థితి.

డిఎస్‌సి పైనే ఆశలు

ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహిస్తున్న డిఎస్‌సి పైనే ఆయా పాఠశాలల విద్యార్థుల భవిష్యత్ ఆధారపడి ఉంది. డిఎస్‌సి పరీక్షలు, ఫలితాలు, కౌన్సెలింగ్ అనంతరం అభ్యర్థులకు పోస్టింగులు ఇవ్వాలి. ఇవన్నీ జరగాలంటే కొన్ని నెలలు ఆగాల్సిందే. అప్పటివరకు తమ పిల్లల పరిస్థితి ఏంటనేది విద్యార్థుల తల్లిదండ్రుల ప్రశ్న. ప్రత్యామ్నాయ మార్గాలు యోచించి వారి విద్యకు అంతరాయం లేకుండా బోధించాలని కోరుతున్నారు.

ఎంటిఎస్‌ల సేవలతో..

జిల్లాలో సుమారు 200 వరకు ఎంటిఎస్ (మల్టీ టాస్కింగ్ స్టాఫ్) సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కవిటి మండలంలో వీరి సేవలు ఉపయోగించుకుంటే చాలావరకు విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఆ విధంగా చర్యలు తీసుకుంటుందో, లేదో చూడాల్సి ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



మండలంలో ఉపాధ్యాయుల కొరత సమస్యను స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌తో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య దృష్టికి తీసుకెళ్లాం. వీలైనంత తొందరగా విద్యార్థుల చదువుకు ఇబ్బంది లేకుండా ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తామని చెప్పారు.

- ధనుంజయ మజ్జి,
మండల విద్యాశాఖ అధికారి

జీడి పరిశ్రమలు తెరవకపోతే పోరాటం

- **21న పలాసలో మహాధర్నా**
- **సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు**

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జీడి పరిశ్రమల యాజమాన్యాలు అక్రమంగా బంద్ చేసిన పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తెరిపించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పితేజేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎం.ఆదినారాయణమూర్తి, కె.సూరయ్య డిమాండ్ చేశారు. లేకుంటే ఈనెల 21న పలాసలో కార్మికులతో కలిసి మహా ధర్నా చేపడతామని హెచ్చరించారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పలాస పారిశ్రామిక ప్రాంతంలో జీడి పరిశ్రమల యాజమాన్యాలు ఆకస్మికంగా బంద్ ప్రకటించడం చట్టవ్యతిరేక చర్య అని అన్నారు. పరిశ్రమలు బంద్ చేసి రెండు వారాలు పూర్తయినా నేటికీ తెరవకపోవడంతో, సుమారు 20 వేల మంది కార్మికులు ఉపాధి లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూసివేసిన పరిశ్రమలు వెంటనే తెరిపించాలని, బంద్ కాలానికి కార్మికు లందరికీ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఇఎస్ఐ కట్టాలన్నారు. అనుమతుల్లేకుండా పరిశ్రమలు బంద్ చేయడం చట్టవిరుద్ధమని చెప్పారు. జీడిపప్పుకు ధర లేదనే పేరుతో బంద్‌కు పిలుపు ఇచ్చినట్లు పరిశ్రమల యాజమాన్యాలు చెప్పడం సరికాదన్నారు. యాజమాన్యాలకు లాభాలు వచ్చినప్పుడు కార్మికులకు అదనంగా ఇన్సెంటివ్ ఏమీ ఇవ్వడం లేదని అన్నారు. నష్టాలు పేరుతో పరిశ్రమలు మూసివేయడం వల్ల కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జీడి రైతుల నుంచి తక్కువ రేటుకు పిక్కలు కొని అటు రైతులను, ఇటు కార్మికులకు నష్టం చేస్తున్నారని విమర్శించారు. వెంటనే జీడి పరిశ్రమలు తెరిపించడంతో పాటు మూసివేసిన కాలానికి వేతనాలు చెల్లించే విధంగా కార్మికశాఖ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు

ఆరోపణలు నిరూపించాలి

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం పథకాన్ని వైసిపి జీర్ణించుకోలేకపోతుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. పాఠశాలల నిర్వహణకు కేటాయించిన రూ.రెండు వేలు విద్యాశాఖ మంత్రి లోకేష్ ఖాతాలోకి చేరాయని జగన్ చేసిన ఆరోపణలు నిరూపించాలని డిమాండ్ చేశారు. నగరంలోని విశాఖ-ఎ కాలనీలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే వారందరికీ తల్లికి వందనం కింద రూ.13 వేలు ఇచ్చామన్నారు. దీనిపై వైసిపి నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తూ విద్యార్థులకు ద్రోహం చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైసిపి పాలనలో అమ్మఒడి కింద రూ.15 వేలు ఇస్తామని రూ.13 వేలు ఇచ్చారని, మిగతా రూ.రెండు వేలు జగన్ జేబులోకి వెళ్లిపోయాయా అని ప్రశ్నించారు. నిరాధార ఆరోపణలు సరికాదన్నారు. వైసిపి నాయకుల మాయమాటలను ప్రజలు విశ్వసించడం లేదన్నారు. గత ప్రభుత్వం 42.67 లక్షల మంది విద్యార్థులకు అమ్మఒడిని అమలు చేస్తే, కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మందికి తల్లికి వందనం పథకం వర్తింపజేసిందని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకుందన్నారు. పాఠశాలలు తెరిచే నాటికి పథకం అమలు చేశారని... ఒకటో తరగతిలో, ఇంటర్ ఫస్టియర్‌లో చేరే విద్యార్థులకూ పథకం అమలు చేసేందుకు చర్యలు తీసుకుందన్నారు. సాంకేతిక లోపాలను సరిదిద్దుతున్నామని, ఏదైనా కారణంతో పథకం అందకపోయిన వారి నుంచి గ్రామ సచివాలయాల్లో ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈనెలలోనే అన్నదాత సుఖీభవ పథకాన్నీ అమలు చేస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈనెల 21న విశాఖపట్నంలో యోగాంధ్ర కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి ఐదు వేల మంది బయలుదేరాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టిడిపి నాయకులు మాదారపు వెంకటేష్, చిట్టి మోహన్, ఉంగటి రమణమూర్తి, కవ్వాడి సుశీల, ఇప్పిలి తిరుమలరావు, పి.ఎం.జె బాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మున్సిపల్ (ఇంజినీరింగ్, పారిశుధ్య) కార్మికులందరికీ తల్లికి వందనంతో పాటు ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) నాయకులు కోరారు. ఈమేరకు శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ పి.వి.వి.డి ప్రసాదరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆప్కాస్ ఉద్యోగి అనే పదాన్ని తొలగించి మున్సిపల్ కార్మికులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

గతంలో 17 రోజుల సమ్మె సందర్భంగా ప్రతిపక్ష నేతగా చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలన్నీ ఎలాంటి షరతుల్లేకుండా అమలు చేస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మంచి జరుగుతుందని కార్మికులు ఆశించారని, అందుకు భిన్నంగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయన్నారు. కార్మికుల పేదరికాన్ని పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, నగర అధ్యక్షులు ఎ.గణేష్, కమిటీ సభ్యులు ఎ.గురుస్వామి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అల్లుడే కాలయముడు

- **మామను హత్య చేసిన వైనం**
- **మండపల్లిలో దారుణం**

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం



గంగయ్య (ఫైల్)

కాలు కడిగి కన్యాదానం చేసిన అల్లుడే కాలయముడయ్యాడు. మామపై కత్తితో దాడి చేసి పొట్టన పెట్టుకున్నాడు. ఈ దారుణ ఘటన మండలంలోని మండడపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో అదే గ్రామానికి చెందిన బర్రి గంగయ్య (59) మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండపల్లికి చెందిన గంగయ్య, జానకమ్మకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. పెద్ద కుమార్తె ఢిల్లమ్మను అదే గ్రామానికి చెందిన జీవన్ రెడ్డి అలియాస్ దాస్‌కు ఇచ్చి వివాహం చేశారు. మద్యానికి బానిసైన జీవన్‌రెడ్డి తరచూ భార్యను కొడుతూ వేధించేవాడు. ప్రసవానికి కుమార్తెను ఇంటికి తీసుకురాగా, ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. ఢిల్లమ్మను తీసుకెళ్లకుండా పుట్టింటిలోనే వదిలేయడంతో గంగయ్య పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీ పెట్టారు. గ్రామ పెద్దలు మందలించడంతో భార్యను బాగా చూసుకుంటానని చెప్పి జీవన్ రెడ్డి తన ఇంటికి తీసుకెళ్లాడు. రెండోసారి గర్భం దాల్చిన ఢిల్లమ్మ కుమార్తె పుట్టింది. తర్వాత భర్త వేధింపులతో పుట్టింటికి వచ్చింది. జీవన్ రెడ్డి బైక్ కావాలని వేధించడంతో డ్వాక్రా రుణం తీసుకుని కొని అల్లుడుకి ఇచ్చారు. ఆ రుణం నెలవారీ చెల్లింపులు చేయకపోవడంతో జీవన్‌రెడ్డి, ఢిల్లమ్మ మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయంపైనే మామా అల్లుళ్ల మధ్య గొడవ తలెత్తడంతో గంగయ్యపై జీవన్ రెడ్డి పగ పెంచుకున్నాడు. గొడవకు సంబంధించి గ్రామ పెద్దలకు చెప్పేందుకు గంగయ్య సైకిల్‌పై మంగళవారం వెళ్తుండగా, గ్రామ సచివాలయం సమీపంలో అడ్డగించిన అల్లుడు తన వెంట తెచ్చుకున్న కత్తితో గంగయ్య కడుపులో మూడు సార్లు పొడిచి అక్కడ్నుంచి పరారయ్యాడు. తీవ్ర రక్తస్రావమైన గంగయ్యను స్థానికులు హుటాహుటిన ఇచ్ఛాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గంగయ్య మృతితో కుటుంబసభ్యులు భోరున విలపించారు. పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.



గంగయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

యోగాంధ్రకు సమన్వయం అవసరం

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 21న ప్రధాని నరేంద్ర మోడీ హాజరయ్యే విశాఖపట్నంలోని యోగాంధ్ర కార్యక్రమం విజయవంతానికి ప్రతి శాఖ సమన్వయంతో, సమగ్ర పర్యవేక్షణతో ముందుకు సాగి విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో వారు మాట్లాడారు. ఇది సాధారణ కార్యక్రమం కాదని, గిన్నిస్ బుక్‌లో స్థానం దక్కించే కార్యక్రమమన్నారు. దీన్ని దిగ్విజయం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. జిల్లా నుంచి విశాఖకు వెళ్లే ప్రణాళికలను కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా నుంచి 20 వేల మంది విశాఖ కార్యక్రమానికి వెళ్తారని తెలిపారు. 150 ఆర్‌టిసి, 400 ప్రైవేట్ బస్సులు ఇందుకోసం ఏర్పాటు చేశామన్నారు. వీరిలో 15 వేల మంది సామాన్య ప్రజలు కాగా, మిగతా ఐదు వేల మంది ఇంటర్ ఆపై చదువుతున్న విద్యార్థులు ఉంటారన్నారు. భీమిలి స్పాట్ జిల్లాకు కేటాయించగా, అక్కడే వేదిక వద్ద అల్పాహారం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తిరుగు ప్రయాణంలో ప్యాకేజ్డ్ భోజనం అందజేయాలని మంత్రులు సూచించారు. తొమ్మిది పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేశామని, పైడి భీమవరం దాటి జిల్లాలోని ప్రజలకు దాబాలు, పెట్రోల్ బంకులు, నేషనల్ హైవే టాయిలెట్ల వద్ద శుభ్రమైన వసతులు కల్పించనున్నట్టు వివరించారు. జిల్లాలో పలు శాఖల భాగస్వామ్యంతో, ఆయుష్ శాఖ పర్యవేక్షణలో యోగాపై ఇప్పటికే ప్రత్యేక శిక్షణలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈనెల 21న నిర్వహించనున్న యోగాంధ్ర కోసం జిల్లాలో 6,500 వేదికలు గుర్తించగా, అందులో 3,500 పాఠశాలలు ఉన్నాయన్నారు. జిల్లాలో కార్యక్రమానికి సంబంధించి ఇప్పటికే 9.5 లక్షల మంది రిజిస్ట్రేషన్ పూర్తయిందని తెలిపారు. మొత్తం 10 లక్షల మందిని కార్యక్రమంలో భాగస్వాములుగా చేయాలన్నదే లక్ష్యమన్నారు.


పశుదాణాను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

పాడి రైతుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి- పొందూరు
ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న పశుదాణాను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని పియుసి చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పొందూరు ప్రాంతీయ పశువైద్యశాలలో మంగళవారం పశు దాణా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడిరైతుల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో ప్రయోజనాలను కల్పిస్తుందన్నారు. మండలంలో 155 మంది పాడి రైతులకు రూ.1100 విలువ కలిగిన పశుదాణా బస్తాను రూ.555కే అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎడిలు డాక్టర్లు రఘునాథ్, పి.ఎస్.జి.బాలకృష్ణ, సర్పంచ్ రేగిడి లక్ష్మి టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, టిడిపి నాయకులు అన్నెపు రాము, బలగ శంకరభాస్కరరావు, బాడాన శేషగిరి, అనకాపల్లి శ్రీరంగనాయకులు, అనకాపల్లి విజయలక్ష్మి పాల్గొన్నారు.


రణస్థలం : మాట్లాడుతున్న నరసింహులు నాయుడు

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- రణస్థలం
పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రణస్థలం, లావేరు మండలాల పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పున్నాన నరసింహులు నాయుడు, ఎన్ల పాపినాయుడు అన్నారు. రణస్థలంలో మంగళవారం పెన్షనర్ల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'పెన్షనర్ల సమస్యలు ఏమైనా ఉంటే తమకు తెలియజేస్తే వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో సంప్రదిస్తామని తెలిపారు. ఇక నుంచి ప్రతినెలా రణస్థలంలో పెన్షనర్ల సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఫారం-16 కోసం పెన్షనర్స్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పెన్షనర్లు తంబు ఇంప్రెషన్ కోసం ఎస్‌టిఒ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని, మీకు అందుబాటులో ఉన్న మీ సేవ కేంద్రాల్లో తంబు ఇంప్రెషన్ వేసుకోవచ్చునని అన్నారు.
ఆమదాలవలస : పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సిమ్మినాయుడు, బొడ్డేపల్లి జనార్ధనరావులు కోరారు. సబ్ ట్రెజరీ కార్యాలయంలో నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన సబ్ ట్రెజరీ అధికారి బి.కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల గౌరవాధ్యక్షుడు బొడ్డేపల్లి మోహనరావు, కోశాధికారి హెచ్.వి.సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు కె.షణ్ముఖరావు, బొడ్డేపల్లి జోగారావు, బెండి సూర్యనారాయణ, నారాయణరావు పాల్గొన్నారు.

వాడివేడిగా మండల సమావేశం

ప్రజాశక్తి- లావేరు
తమకు అభివృద్ధి పనులు కేటాయించాలని, పంచాయతీ తీర్మానాలు తీసుకుని తమకు అన్యాయం చేస్తారా? అని మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణను అధికారులను నిలదీశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి లుట్ట అమ్ముజమ్మ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సమావేశం వాడివేడిగా సాగింది. ముందుగా గృహ నిర్మాణాలపై ఎఇ ఎం.రమేష్ మాట్లాడుతూ మండలానికి 2,500 ఇళ్లు మంజూరయ్యాయని వివరించారు. దీనిపై అధికారులు గ్రామాల్లో కూటమి నాయకులు కనుసన్నల్లోనే వారి చెప్పిన పనులే చేస్తున్నారని గుర్రాలపాలెం సర్పంచ్ బాష, ఎంపిటిసి జె.భానోజీరావు సభ దృష్టికి తీసుకొచ్చారు. మండల ఇంజినీరింగ్ అధికారి శ్రీవల్లి మండలానికి సిమెంట్, తారు రోడ్ల నిర్మాణాలకు రూ.21.73 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో పనులో ప్రారంభిస్తామని వెల్లడించారు. దీనిపై గుమ్మడాం, గుర్రాలపాలెం, అదపాక ఎంపిటిసిలు జగ్గరోతు తవిటినాయుడు, భానోజీరావు, గంట్యాడ సత్యం మాట్లాడుతూ గతేడాది నుంచి గ్రామసభల్లో తీర్మానాలు మేము చేస్తే... అభివృద్ధి పనులు తమకు కేటాయించకుండా కూటమి కార్యకర్తలకు, నాయకులకు ఇవ్వడం అన్యాయమని నిలదీశారు. తమకు అభివృద్ధి పనులు కేటాయించకపోతే ఇక నుంచి పంచాయతీ తీర్మానాలు ఇవ్వబోమని సభ్యులు గందరగోళం సృష్టించారు. దీనిపై బాలకృష్ణ కలుగజేసుకుని అలానే చేద్దామంటూ అనడంతో సభ సద్దుమణిగింది. అలాగే పింఛన్లు మంజూరుకు గత రీ సర్వే సమయంలో దరఖాస్తు చేసుకున్నారని, వారికి కాకుండా ఇటీవల దరఖాస్తు చేసుకున్న వారికి పింఛన్లు మంజూరు చేశారని అధికారులను నిలదీశారు. ఐసిడిఎస్ సిడిపిఒ కూన రూపాలత మాట్లాడుతూ నూతనంగా వెంకటాపురం అంగన్వాడీ కార్యకర్త నియకానికి బిసి అభ్యర్థికి, యతపేటకు మినీ అంగన్వాడీ కార్యకర్త బిసి కేటగిరీకి కేటాయించినట్లు చెప్పారు. మండల సర్వేయరు బచ్చు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ


అధికారులను నిలదీస్తున్న సభ్యులు

మండలంలోని 42 రెవెన్యూ గ్రామాలు ఉండగా, ఇప్పటికే 21 గ్రామాల్లో రీ సర్వే పూర్తయ్యిందని అన్నారు. మండలంలోని నాలుగు బిసి వసతిగృహాల్లో విద్యార్థులకు సీట్లు ఖాళీగా ఉన్నాయని మురపాక వార్డెన్ దాసు అన్నారు. సమావేశంలో జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, ఎంపిడిఒ పి.వెంకటరాజు, సూపరింటెండెంట్ సునీత, పశువైద్యాధికారి గాయత్రి, లావణ్య పాల్గొన్నారు.

బస్సు పాసులకు అగచాట్లు

ప్రజాశక్తి- బూర్జ
ఆర్‌టిసి బస్సు పాసుల కోసం విద్యార్థులు అగచాట్లు పడుతున్నారు. ఈ నెల 12న నుంచి పాఠశాలలు ప్రారంభం కావడంతో పాలకొండ నుంచి శ్రీకాకుళం, ఆమదాలవలస ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలలకు విద్యార్థులు వెళ్తున్నారు. గత ఐదు రోజులుగా బస్ పాసుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి తలెత్తింది. బూర్జ మండలం నుంచి ఇటు పాలకొండ, అటు ఆముదాలవలస వెళ్లే విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పాలకొండ ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్ వద్ద బస్సు పాసుల కోసం రోజూ ఉదయం 7 నుంచి సాయంత్రం వరకూ క్యూ లైన్‌లో వేచి ఉంటున్నారు. అయినా బస్సు పాస్ రాని పరిస్థితి ఉంది. బస్సు పాస్ ఇచ్చే సమయంలో సర్వర్ ఇబ్బంది పెట్టడంతో దిక్కుతోచని స్థితిలో విద్యార్థులు ఇంటి ముఖం పడుతున్నారు. రోజూ ఛార్జీలు కట్టుకుని వెళ్లాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. ఆర్‌టిసి అధికారులు స్పందించి మరొక కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ


లైన్‌లో వేచి ఉన్న విద్యార్థులు

విషయంపై పాలకొండ ఆర్‌టిసి డిపో మేనేజర్ వెంకటేశ్వర్లను వివరణ కోరగా, తమ పరిధిలోని వీరఘట్టం, రాజాం, పాలకొండ, సరుబుజ్జిలి, బూర్జ, రేగిడి మండలాల విద్యార్థులకు బస్సు పాసులు అందజేస్తున్నామని తెలిపారు. ఇంతవరకు మూడు వేల మంది విద్యార్థులకు బస్సు పాసులను మంజూరు చేశామన్నారు. సర్వర్ ఇబ్బందులు కారణంగా సకాలంలో బస్సు పాసులు అందజేయలేకపోతున్నామని తెలిపారు. రాత్రి 8 గంటల వరకు బస్సు పాస్సులను సిబ్బంది అందజేస్తున్నారని తెలిపారు. తమ పరిధిలోని విద్యార్థులందరికీ సకాలంలో పాసులను అందజేసేందుకు చర్యలు చేపట్టామని అన్నారు.

పాఠశాలకు మొక్కలు

మందస: మండలంలోని కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో గతేడాది పదో తరగతి చదివిన చిన్నారి తెప్ప వెన్నెల మంగళవారం జన్మదినం సందర్భంగా తాను చదువుకున్న పాఠశాలకు కొన్ని మొక్కలను బహుకరించారు. ప్రధానోపాధ్యాయులు కె.వేణుగోపాల్ ఆధ్వర్యాన చిన్నారుల కుటుంబ సభ్యులతో పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో పిఎంసి మాజీ చైర్‌పర్సన్ తెప్ప జ్యోతి, రవికుమార్, గోపి, ఉపాధ్యాయులు ఎస్.గణేశ్వరరావు, జి.భీమారావు, ఎం.లక్ష్మణరావు, జి.జానకమ్మ, బి.పాపమ్మ, ఎం.చిత్రసేను, ఎం.దామోదరం, పి.కీర్తన పాల్గొన్నారు.


మొక్కను నాటుతున్న వెన్నెల


ఇచ్ఛాపురం : పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విజయ, రామారావు

వెన్నుపోటు పుస్తకాల ఆవిష్కరణ

ఇచ్ఛాపురం : అబద్ధపు హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిందని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. స్థానిక స్వేచ్ఛావతి ఆలయంలో మంగళవారం 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, సోంపేట, కంచిలి ఎంపిపిలు నిమ్మన దాస్, ఎంపిపి పైల దేవదాస్‌రెడ్డి, కవిటి ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ పాల్గొన్నారు.
నౌపడ : కూటమి ప్రభుత్వం బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చి ఏడాది పాలనంతా ప్రజలకు వెన్నుపోట్లు పొడిచారని సంతబొమ్మాళి మండల వైసిపి నాయకులు విమర్శించారు. మండలంలోని హనుమంతు నాయుడుపేట వైసిపి కార్యాలయంలో జెడ్‌పిటిసి పాలవసంత రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బుడ్డా మోహన్‌రెడ్డి ఆధ్వర్యాన మంగళవారం వెన్నుపోటు పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి నాయకులు ఏడాది పాలనలో చేసిన అరాచకాలు, ప్రజావ్యతిరేక విధానాలపై మండిపడ్డారు. కార్యక్రమంలో పిట్ట పాపారావు, గిన్ని ప్రకాష్, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.
లావేరు : మండల పరిషత్ కార్యాలయంలో వెన్నుపోటు పుస్తకాన్ని వైసిపి మండల సమన్వయకర్త దన్నాన రాజినాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, జెడ్‌పిటిసి ఎం.సీతంనాయుడు, సర్పంచ్ శాంతాటి భాస్కరరావు, బాష, జగ్గరోతు తవిటినాయుడు, దుర్గాసి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- నందిగాం
మండలంలోని నందిగాంకు చెందిన కొర్లాపు శంకర్ (40) మంగళవారం విద్యుదాఘాతంతో మృతి చెందారు. శంకర్ రోజు కూలీగా పనిచేస్తూ... కుటుంబాన్ని పోషించేవాడు. ఎప్పటిలాగే సెంట్రింగ్ మేస్త్రితో పాటు ఇదే మండలం జల్లపల్లిలో రాడ్ బెండింగ్ చేస్తున్నాడు. రెండో అంతస్తులో పనులు చేస్తుండగా... పైన ఉన్న విద్యుత్ వైర్లకు ఐరన్ రాడ్ తగింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై ఘటనాస్థలంలోనే కుప్పకూలిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య గౌరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాయి. దీంతో నందిగాంలో విషాద ఛాయలు అలముకున్నాయి.


శంకర్ మృతదేహం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు

పుస్తకాలు అందజేత

ఎచ్చెర్ల: బాపట్ల వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థుల జీవనచిత్రాలు విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉంటాయని ఇండియన్ బ్యాంకు విశ్రాంత చీఫ్ మేనేజర్ సదాశివుని లక్ష్మణరావు అన్నారు. డాక్టర్ ఐ.వి.సుబ్బారావు స్మారక కమిటీ పర్యవేక్షణలో బాపట్ల వ్యవసాయ కళాశాల 1945 నుంచి 2020 బ్యాచ్‌ల వారీగా సంక్షిప్త జ్ఞాపకాలు రచించిన పుస్తకాలను మంగళవారం వ్యవసాయశాఖకు ప్రెసిడెంట్ జ్యోతిశంకరరావు అధ్యక్షతన మంగళవారం అందజేశారు. 'ఒకనేల', 'వెలుతురుతోవలు', 'వెలుగుదివ్వెలు' జీవనచిత్రాలు పొందుపర్చిన మూడు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో పుస్తక సంపాదకులు గోపీచంద్, బి.శవశంకర్ పట్నాయక్, నైర వ్యవసాయ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.కనకరాజు, ఎస్‌ఐబి విశ్రాంత చీఫ్ మేనేజర్ చౌదరి ప్రసాద్, కిషోర్, కిరణ్ పాల్గొన్నారు.


నేత్రాలను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

పలాస: జిల్లా అంధత్వ నివారణ సంఘం, శంకర్ ఫౌండేషన్ నేత్రాస్పత్రి ఆధ్వర్యాన స్థానిక సత్యసాయి మందిరంలో మంగళవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. నేత్ర వైద్యాధికారి రోణంకి వెంకటరమణ 105 మందికి నేత్రాలను పరీక్షించారు. అందులో 55 మందికి నేత్ర శుక్లాల ఆపరేషన్‌కు రిఫర్ చేశారు. సత్యసాయి సేవాసమితి కన్వీనర్ ఇప్పిలి తిరుమలరావు, శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్య సిబ్బంది వివేకావర్మ, క్యాంపు మేనేజర్ కె.ఎ.రాజు, కో-ఆర్డినేటర్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం మూసివేత

ఇచ్ఛాపురం: మండలంలోని ఈదుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న వివాదాస్పద మద్యం దుకాణం ఎట్టకేలకు మంగళవారం మూతపడింది. ఇటీవల పాఠశాల సమీపంలో మద్యం షాపును ఏర్పాటు చేవారు. దీంతో సర్పంచ్ ఆధ్వర్యాన గ్రామస్తులు నిరసనలు,ఆ ందోళన చేపట్టారు. ఇటీవల కలెక్టర్, ఎక్సైజ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అధికారులు ఆదేశాలతో మద్యం షాపు మూసివేశారు. ఇదే విషయమై ఎక్సైజ్ సిఐ పి.దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా, నిబంధనల ప్రకారమే షాపు కేటాయించామని తెలిపారు. కానీ, గ్రామస్తుల నుంచి వ్యతిరేకత, అభ్యంతరం రావడంతో ఉన్నత అధికారుల ఆదేశాలు మేరకు షాపును మూసివేశామన్నారు. మరోచోటకు తరలించేందుకు అనుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు.


పద్మనాభంను సన్మానిస్తున్న మహిళలు

పాయతారు అభివృద్ధికి కృషి

ఇచ్ఛాపురం: మండలంలోని పాయతారు పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని టిడిపి మండల అధ్యక్షులు లొపింటి పద్మనాభం హామీనిచ్చారు. ఈ మేరకు పంచాయతీ ప్రజలు, తెలగవీధి జనసేన నాయకులు మంగళవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపితోనే మహిళా సంక్షేమం సాధ్యమన్నారు. సిఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ కృషితో మారుమూల గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. వలపల కిరణ్ కుమార్, వలపల కృష్ణారావు, లైసెట్టి కేశవరావు, నిరంజన్ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత తప్పనిసరి

లావేరు : తాగునీటి పథకం నిర్మాణం పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ఎం.మణికంఠ అన్నారు. మండలంలోని తాళ్లవలసలో రూ.56 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న తాగునీటి పథకం నిర్మాణం పనులను మంగళవారం పరిశీలించారు. పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముప్పిడి మురళీమోహనరావు, టిడిపి నాయకులు దారపురెడ్డి కూర్మారావు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

లావేరు : మండలంలోని పాతరౌతుపేట సమీపంలో ఉన్న జీడితోటల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై మంగళవారం దాడి చేశామని ఎఎస్‌ఐ పి.జగన్మోహన రావు తెలిపారు. కొద్ది రోజులుగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.4,665 నగదు, ఐదు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

టిడిపి మండల అధ్యక్షునిగా మాధవరావు


మాధవరావు

కొత్తూరు : టిడిపి మండల అధ్యక్షునిగా అగతముడి మాధవరావు ఎన్నికయ్యారు. పాతపట్నంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అధ్యక్షతన ఐదు మండలాల కార్యకర్తలతో, నాయకులతో, అభిమానులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. అనంతరం ఐదు మండలాల టిడిపి మండల అధ్యక్షులను ఎన్నుకున్నారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా ఆరుబోలు దశరథరావు, బిసి సెల్ అధ్యక్షునిగా కొయిలాపు సంజీవరావు ఎన్నికయ్యారు. మాధవరావు గతంలో మదనాపురం సర్పంచ్‌గా మూడుసార్లు ఎన్నికచయ్యారు. ఈయన సతీమణి సత్యవతి మండల పరిషత్ ఉపాధ్యక్షులుగా పనిచేశారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

రణస్థలం: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఇడదాసుల విద్య ఆరోగ్య ఫౌండేషన్, శంకర్ ఫౌండేషన్, సూర్య ఆస్పత్రి ఆధ్వర్యాన బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఇడదాసుల విద్య ఆరోగ్య ఫౌండేషన్ అధ్యక్షులు ఇడదాసుల తిరుపతిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు షిర్డీ సాయిబాబా ఆలయం ఎదురుగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సూర్య ఆస్పత్రి డాక్టర్ ఇడదాసుల యశ్వంత్ ఉచిత ఓపి, బిసి, సుగర్, ఇసిజి పరీక్షలు చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9848004156 సెల్ నంబరును సంప్రదించాలని కోరారు.

22న ఫొటోగ్రఫీపై అవగాహన

కవిటి: బేసిక్ ఫొటోగ్రఫీ, ఔట్ డోర్ లైటింగ్ టెక్నిక్‌పై ఫొటోగ్రాఫర్స్ సర్వీస్ సొసైటీ, కవిటి ఆధ్వర్యాన ఈ నెల 22న అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు ఆరింగి గోపి ఒక ప్రకటనలో తెలిపారు. ఇచ్ఛాపురం మినీ కైలాసగిరిలో నిర్వహించే ఈ అవగాహన కార్యక్రమానికి ఎటువంటి ప్రవేశ రుసుం లేదన్నారు. స్థానిక ఫొటోగ్రాఫర్లు యూనియన్లతో సంబంధం లేకుండా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నా స్థలం కబ్జాకు యత్నం


పట్టా చూపిస్తున్న బాధితుడు

ఆమదాలవలస : పట్టణ నడిబొడ్డున ఉన్న శివాలయం ముందర ఉన్న తన స్థలాన్ని కబ్జా చేసేందుకు చోటా నాయకుడు బొడ్డేపల్లి విజయ్ యత్నిస్తున్నాడని స్థల యజమాని పుల్లేటికుర్తి వెంకటరమణ అన్నారు. మంగళవారం వేకువజామున విజయ్ తన అనుచరులతో కలిసి ప్రొక్లెయినర్ సహాయంతో స్థలాన్ని చదును చేసేందుకు యత్నించారని అన్నారు. దీంతో తాను పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశానని తెలిపారు. తమ్మినేని ప్రసాద్ పేరుతో తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి స్థలాన్ని కాజేసే ప్రయత్నం చేస్తున్నాడని బాధితుడు రోదించాడు. ఇసి లింక్ డాక్యుమెంట్లు అన్నీ తన పేరుపై ఉన్నాయని, అధికారులు కబ్జాదారుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. విజయపై ఇప్పటికీ మూడు సార్లు పోలీసులకు ఫిర్యాదు చేశానని, అయినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని బాధితుడు వాపోయాడు. తహశీల్దార్ కార్యాలయంలో పొజిషన్ ధ్రువపత్రం కోసం మూడుసార్లు దరఖాస్తు చేసుకున్నానని తెలిపారు. అధికారులు కుంటి సాకులు చూపుతూ తనకు పొజిషన్ ధ్రువపత్రం ఇవ్వడం లేదని తెలిపారు.

రూ.40 లక్షలతో జంగిల్ క్లియరెన్స్


బూర్జ : రూ.40 లక్షల నిధులతో దేశాయ్ ఛానల్‌లో జంగిల్ క్లియరెన్స్ చేపడుతున్నామని నీటిపారుదలశాఖ జెఇ మంగళవారం తెలిపారు. మండలంలోని తోటపల్లి కాలువలో రూ.20 లక్షలతో 20 కిలోమీటర్ల మేరకు జంగిల్ క్లియరెన్స్ చేసేందుకు పనులు ప్రారంభించామన్నారు. నాగావళి ఓపెన్ హెడ్ ఛానళ్లు మండలంలో ఆరు ఉన్నాయని తెలిపారు. అందులో పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలంలోని అన్నవరం, బూర్జ మండలం అల్లిని, బూర్జ, వావాం, కాఖండ్యాం, లాభం ఓపెన్ హెడ్ ఛానల్ జంగిలి క్లియరెన్స్ చేపడుతున్నామన్నారు. శివారు భూములు నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

విద్యామిత్ర కిట్లు పంపిణీ

ఇచ్ఛాపురం : పంజా వీధిలోని మున్సిపల్ పాఠశాలలో మంగళవారం 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర క్టిలను పంపిణీ చేశారు. విద్యార్థుల్లో విద్యాప్రతిభను పెంపొందించేందుకు ఉద్దేశించిన పుస్తకాలు, యూనిఫారాలు, బెల్ట్, షూస్, బ్యాగులు అందజేశామని ఎంఇఒ అప్పారావు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని నింపుతాయని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భాస్కరరావు, ఎస్ఎంఎస్ చైర్మన్ బి.దొరబాబురెడ్డి పాల్గొన్నారు.

ఉద్యానవన పంటలతో అధిక లాభాలు

కోటబొమ్మాళి: ఉద్యాన పంటల ద్వారా రైతులకు ఎకరానికి తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చునని ఉద్యానవన శాఖాధికారి కె.సునీత తెలిపారు. మండల ఎఒ ఎన్.గోవిందరావుతో కలిసి మండలంలోని చిట్టేవలసలో పంట మార్పిడిపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యాన పంటలైన రియల్‌పాయ్, మామిడి, జీడిమామిడి, కొబ్బరి, మునగ, బొప్పాయి, డ్రాగన్‌ఫ్రూట్, శాశ్వత పందిళ్లపై కూరగాయల సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చునని రైతులకు వివరించారు.


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

యోగా డేను విజయవంతం చేయాలి

ఆమదాలవలస : ఈ నెల 21న విశాఖపట్నంలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పెడన, మార్కాపురం ఎమ్మెల్యేలు కాగితపు కృష్ణప్రసాద్, కందుల నారాయణరెడ్డిలు కోరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్‌తో యోగా డేపై మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు యోగా దినోత్సవం విజయవంతానికి కృషి చేస్తున్నారని అన్నారు. ఈ యోగాకు పిఎం మోడీ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, జిల్లా టిడిపి నాయకులు మొదలవలస రమేష్, తమ్మినేని సుజాత, తమ్మినేని చంద్రశేఖర్, నూకరాజు, హనుమంతు బాలకృష్ణ పాల్గొన్నారు.
అలాగే టిడిపి నాయకులు పేడాడ జనార్ధనరావు శ్రీహరిపురంలోని తన స్వగృహంలో యోగా విజయవంతంపై విలేకరులతో మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు అందరూ యోగా దినోత్సవ విజయవంతానికి కృషి చేస్తున్నారని అన్నారు. సమావేశంలో యోగా గురువు డాక్టర్ బగాది పాపారావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కూన అప్పలనాయుడు, న్యాయవాది ఎస్.మురళి, ఎస్.వెంకట్రావు, సురేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు


మెళియాపుట్టి : విత్తనాలు పంపిణీ చేస్తున్న నాయకులు

వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి- మెళియాపుట్టి
ఖరీఫ్ రైతులకు సమయానికే వరి విత్తనాలు అందించామని ఎంపిపి ప్రతినిధి బైపోతు ఉదయ్‌కుమార్, జిల్లా టిడిపి మహిళా ఉపాధ్యక్షులు బూర్ల లలిత కుమారి అన్నారు. మండలంలోని పెద్దలక్ష్మీపురంలో రైతులకు మంగళవారం విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశానికి వెన్నెముక అయినా రైతులకు సమయానికే నాణ్యమైన విత్తనాలు సాగుకు సాయం అందిస్తే వారు ప్రపంచానికే ఆహారాన్ని అందిస్తూ అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రం వద్దకు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం తీసుకొని వెళ్లి అవసరమైన విత్తనాలు రాయితీపై పొందాలని సూచించారు. కార్యక్రమంలో మండల సోషల్ మీడియా కన్వీనర్ ఒట్టుకోల చక్రి, మండపాల తిరుపతిరావు, శశిభూషణరావు, గణపతిరావు, భైరాగి, వ్యవసాయ అధికారి ఎస్.సూర్య పాల్గొన్నారు.
వజ్రపుకొత్తూరు : మండలంలోని పి.ఎం.పురం సచివాలయంలో రైతులకు సర్పంచ్ గొరకల వసంతరావు వరి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కె.గోపాల్, కార్యదర్శి త్రినాథ్‌రెడ్డి, విఎఎ సందీప్ పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలే ముద్దు

ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- మందస
మహిళా సంఘ సభ్యులు ఎట్టి పరిస్థితుల్లోనూ మైక్రో ఫైనాన్స్ సంస్థల అధిక వడ్డీ రుణాలు వాడవద్దని, గ్రామ సంఘం ద్వారా స్త్రీనిధి, బ్యాంకు రుణాలే ముద్దు అని ఐటిడిఎ వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు సూచించారు. మందస పంచాయతీ రెల్లి వీధిలోని మహిళా సంఘాలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఒక్కొక్కరిగా సాధించలేని చాలా విషయాలు అంతా ఒక్కటై సాధించగలరని అన్నారు. నిరక్షరాస్యులైన మహిళలు ఉల్లాస్ పథకం ద్వారా కొంతమేరకు అక్షరాస్యులు కాగలరని వివరించారు. పుస్తక నిర్వహణలో సంగ్రహ పట్టికలు వేసుకొని వ్యక్తిగత ఖాతాలో కచ్చితంగా లావాదేవీలన్నీ నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో లీగల్ కో-ఆర్డినేటర్ తారక మోహన్, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు స్వామి నాయుడు, రమేష్, ఎంట్రీ ఆపరేటర్ రాజారావు, విఒఎ నీరజ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

ఏనుగుల సంచారం

కొత్తూరు: మండలంలోని బడిగాం గిరిజన గ్రామ సమీపంలోని చందనపు తోటలో సోమవారం రాత్రి నాలుగు ఏనుగుల గుంపు సంచరించాయి. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం పులిపుట్టి పరిసరాల్లోకి మంగళవారం వెళ్లాయి. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఏ సమయంలో గ్రామంలోకి వస్తాయేమోనని ఆందోళన చెందుతున్నారు. దీంతో కొత్తూరు, సీతంపేట మండలాల పరిధిలోని మర్రిపాడు, పూతికవలస, చిన్నబగ్గ గిరిజనుల రాకపోకలు నిలిచిపోయాయి. ఏనుగుల సంచారం నేపథ్యంలో ఆ గ్రామాల్లో ఉపాధి పనులను నిలుపుదల చేశారు. ఏనుగులపై కవ్వింపు చర్యలకు పాల్పడరాదని అటవీశాఖ అధికారులు ప్రజలకు సూచించారు.


సంచరిస్తున్న ఏనుగులు


పొందూరు : పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఇఒ మోహన్‌బాబు

వైభవంగా గ్రామ దేవత పండగలు

పొందూరు: పొందూరులో మూడురోజులుగా నిర్వహిస్తున్న పైడితల్లి అమ్మవారి గ్రామదేవత పండగను వైభవంగా నిర్వహించారు. మండలంలోని పొందూరు, లక్ష్మీపేట, జోగెన్నపేట, ఎరుకులపేట, తాపీమేస్త్రి కాలనీ, ఎరుకుల కాలనీ, కృష్ణాపురం గ్రామాల్లో ఈ గ్రామదేవత పండలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఘటాలను ఊరేగించారు. సుదూర ప్రాంతాలలో ఉన్న బంధువులు, స్నేహితులు రాకతో ఆయా గ్రామాల్లో కోలాహలం నెలకొంది. పొందూరులో పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణ ఎంతో ఆకర్షణీయంగా నిలిచింది. పలు రకాల విద్యుత్ కాంతులను చూసేందుకు పరిసర గ్రామాల నుంచి తరలివస్తున్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యాన పోలీసులు పలు కూడళ్లో విధులను నిర్వహించారు. బుధవారం అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండడంతో ముందుగానే కార్లు, ఆటోలు గ్రామాల్లోకి వెళ్లకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. పారిశధ్య సమస్య లేకుండా ఎప్పడికప్పుడు చెత్తాచెదారాలను తొలగించేలా ఇఒ కింతలి మోహన్‌బాబు చర్యలు చేపడుతున్నారు.

దొంగలు చేతివాటం

గ్రామదేవత పండగ సందర్భంగా అధిక సంఖ్యలో తరలివచ్చిన ప్రజలతో నెలకొన్న రద్దీతో ఇదే అదునుగా పలువురు దొంగలు తమ చేతివాటంను ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికే పలువురు తమ సెల్‌ఫోన్లు, వస్తువులను పోగొట్టుకున్నారు. మహిళలు తమ ఆభరణాలు చోరీకి గురికాకుండా జాగ్రత్తగా చూసుకోవాలంటూ పోలీసులు చెబుతున్నారు.
నందిగాం : నందిగాంలోని పొందర వీధి వాసులు మంగళవారం గ్రామదేవత ఉత్సవాలు నిర్వహించారు. వీధి వాసులు ఏకరూప దుస్తులతో పూర్ణ కలశాలతో నందిగాం పురవీధుల మీదుగా డప్పు వాయిద్యాలతో పగటి వేషాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. నీలమణి దుర్గ సండే అమ్మ సామాలమ్మ భూలోకమ్మ గ్రామ దేవతలకు ఊరేగించారు. కార్యక్రమంలో వందలాది మంది యాత్రికులు పాల్గొన్నారు.

తురకశాసనంలో...

సోంపేట : మండలంలోని తురకశాసనంలో గ్రామ దేవత ఉత్సవాన్ని నిర్వహించారు. ఉపాధి కూలీలు ఏటా ఈ పండగను నిర్వహించడం ఆనవాయితీ. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.